# వెన్నెల్లో గోదారి

- తిరుమలశ్రీ

అయిదేళ్ళ తరువాత ఆ ఊరికి వస్తున్నాడు కిరణ్. అతని మనసు ఉప్పొంగిపోతోంది. తన మిత్రుడు వెంకటేశ్‌ని చాన్నాళ్ళ తరువాత కలుసుకోబోతున్నాడన్న సంతోషం ఒకవంకా, గోదావరి తీరాన గంటల తరబడి గడపవచ్చునన్న ఆనందం మరో వంకాను.

పట్టణపు వాతావరణంలో పెరిగిన కిరణ్‌కి పల్లెలంటే ఎంతో ఇష్టం. అందునా గోదావరి వొడ్డున పైటారవేసుకుంటున్న పడతిలా ప్రకృతి అందాలను పుణికి పుచ్చుకుని విలసిల్లే గ్రామాలంటే మరీ ఇష్టం. స్వచ్ఛమైన గాలి, పసిడి నేల, జీవ నదీ జలాలు... ఆ వాతావరణమే ఎప్పుడూ తలపుకు వస్తూంటుంది. 'అచ్చటి ప్రజలు ఎంతటి అదృష్టవంతులు' అనుకుంటూంటాడు.

యూనివర్శిటీలో తనతోపాటు చదువుకున్న వెంకటేశ్‌ది గోదావరి తీరాన వున్న ఓ గ్రామం. ఒకటి రెండుసార్లు సెలవుల్లో స్నేహితులతో అక్కడికి వెళ్లి గడిపిన కిరణ్‌ని అమితంగా ఆకర్షించింది ఆ గ్రామం. గోదావరిలో ఈతలు, ఇసుకలో నడకలు, నది ఒడ్డున గంటల తరబడి కూర్చుని వూసులు, నావ ప్రయాణం, లంకల్లో పచార్లు.. ఎన్నటికీ మరచిపోలేడు తను ఆ అద్భుతమైన అనుభూతిని.

పై చదువులకోసం తాను స్టేట్స్‌కి వెళ్లిపోయినా తీరిక దొరికినప్పుడల్లా ఉత్తరాల ద్వారా స్నేహితులు ఒకరినొకరు పలకరించుకుంటూనే వున్నారు. అగ్రికల్చర్ చదివిన వెంకటేశ్ వున్న ఊళ్ళోనే వ్యవసాయాభివృద్ధికి కృషి చేస్తున్నాడు. ఆ మధ్యనే స్టేట్స్ నుండి తిరిగొచ్చిన కిరణ్, ఎప్పుడెప్పుడు ఆ గ్రామానికి వెళదామా, గోదావరిలో బోటింగ్ చేద్దామా అని ఉవ్విళ్ళూరాడు.

ఆనందంతో స్నేహితుడ్ని రిసీవ్ చేసుకున్నాడు వెంకటేశ్.

"స్టేట్స్ వాతావరణం అలవడినట్లుంది. వొళ్ళు చేశావ్" అన్నాడు.

కిరణ్ నవ్వి "అదేం కాదులేరా. వచ్చి రెండు వారాలయిందిగా. మమ్మీ తన ప్రేమంతా కూరి కొసరి కొసరి తినిపించిన గోరుముద్దల ప్రభావం" అన్నాడు.

వెంకటేశ్ తండ్రి భూస్వామి. పెద్ద లోగిలి వారిది. గోదావరి ప్రక్కనే ఏరు. ఏటి వొడ్డున ఇల్లూను. చుట్టూ కొబ్బరి చెట్లూ, తాటిచెట్లూ, మామిడి చెట్లూను.

ఇంటి ముంగిట ముత్యాల ముగ్గులు. ఆహ్లాదకరమైన వాతావరణం. సిటీలోని భవంతులు ఆ లోగిలి ముందు తీసికట్టేననిపించింది కిరణ్‌కి.

స్నేహితుడికి ప్రత్యేకమైన గది అమర్చి అతనికి ఏ ఇబ్బందీ కలుగకుండా తగు ఏర్పాట్లు చేసాడు వెంకటేశ్.

పడతుల చూపుల తూపులు తనను గుచ్చుకోవడం కొద్దిగా ఇబ్బందిగానే వుంది కిరణ్‌కి. ఎటు కదిలినా తలుపు చాటునుంచో, మరోచోటు నుంచో తొంగిచూసే అమ్మాయిల్ని వారి చేతి గాజుల చప్పుళ్ళే పట్టిస్తున్నాయి. కొత్తవారిపట్ల పల్లె జనానికి వుండే సహజ కుతూహలం తాను ఎరిగిందే అయినా వయసులో వున్న అమ్మాయిలు తనవంక దొంగ చూపులు చూడడమూ, ఎదురుపడితే సిగ్గుల మొగ్గలై తొలగిపోవడమూ ఏదో వింత అనుభూతిని, డెలికసీనీ కూడా కలుగజేస్తున్నాయతనికి.

వెంకటేశ్ నవ్వుతూ ముందే హెచ్చరించాడు మిత్రుడ్ని "ఒరేయ్ కిరణ్! పల్లెపడుచులకు కుతూహలం ఎక్కువ. అందులోనూ నువ్వు అమెరికా రిటర్న్‌డ్ అనేసరికి యాడెడ్ ఎట్రాక్షన్. ఆ ఇబ్బందిని కొంతవరకూ నువ్వు అనుభవించక తప్పదు. అంతేకాదు, పల్లెటూరి పిల్లలకు తెలివితేటలు కొంటెతనమూ కూడా కొంచెం ఎక్కువే. నిన్నో ఆట పట్టించగలరు. జాగ్రత్త సుమా!" అంటూ.

అందుకే తలుపులకూ, గోడలకూ అతుక్కుపోయిన కాటుక కన్నులు కనిపిస్తే ముసిముసిగా నవ్వుకునేవాడు కిరణ్.

వెంకటేశ్‌కి పెళ్లయి రెండేళ్ళయింది. భార్య రాజేశ్వరి కలుపుగోరు మనిషి. అన్నయ్యా అని పిలుస్తూ కిరణ్‌కి ఏం కావాలో స్వయంగా చూసుకుంటోంది.

వారి పెళ్లికి రాలేకపోయినందున స్టేట్స్ నుంచి అతను తెచ్చిన గిఫ్ట్ ఆమెకెంతో నచ్చింది. వెంకటేశ్ వాళ్ళది ఉమ్మడి కుటుంబం కావడంతో ఆ ఇంట్లో చాలామందే వున్నారు. ముఖ్యంగా పెళ్లి కావలసిన అమ్మాయిలు.

ఆ రాత్రి భోజనాలయ్యాక ఆరుబయట కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు మిత్రులు. వెంకటేశ్ కజిన్స్ కూడా వచ్చి కూర్చున్నారు. వెన్నెల రాత్రులేమో ఆకాశం పిండారబోసినట్లుంది. అంబరంలో చుక్కలు చిలిపిగా కన్నులు గిలిపి వెక్కిరిస్తున్నట్లున్నాయి.

గోదావరి గాలి ఏటి మీదుగా వచ్చి శరీరాలకు హాయిని గొలుపుతోంది. గాలికి వూగుతున్న కొబ్బరి ఆకులు వింజామరలు పడుతున్నాయి. ఆడవాళ్ళంతా లోపల చావిట్లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

అమెరికాలోని ఫాస్ట్ లైఫ్, ఆమధ్య టపటపా వూడిపోతున్న సాఫ్ట్‌వేర్ జాబులూ... అలా ఎన్నో టాపిక్స్ మిత్రుల సంభాషణలో దొర్లిపోతున్నాయి.

వారి సంభాషణ అనుకోకుండా దయ్యాలపైకి మళ్లింది.

"ఈ ట్వెంటీఫస్ట్ సెంచరీలో కూడా దయ్యాలు, భూతాలు... నాన్సెన్స్. వీక్‌మైండ్స్ సృష్టించుకునే భయాలూ, అభూతకల్పనలు అవి" అన్నాడు కిరణ్ కొట్టి పారేస్తూ.

"సెంచరీ ఏదైనా వ్యక్తిగత నమ్మకానికి సంబంధించిన విషయమది" అని వెంకటేశ్ అంటే-

"మోస్ట్ ఎడ్వాన్స్‌డ్ అనుకునే అమెరికాలోనే వైట్ హౌస్ లైబ్రరీలో అబ్రహం లింకన్ స్పిరిట్ తిరుగుతోందన్న నమ్మకం ఇప్పటికీ వుంది కదా" అన్నాడు వెంకటేశ్ కజిన్స్‌లో ఒకతను.

"నిజమే. సైన్స్, సొసైటీ అడ్వాన్స్ అయ్యేకొద్దీ మనిషి మూఢనమ్మకాలు కూడా పెచ్చుపెరిగిపోతున్నాయేమో అనిపిస్తుంటుంది ఒక్కోసారి" అన్నాడు కిరణ్.

"ఔను. లేకుంటే వెస్టర్న్ ఫిల్మ్స్ అన్నీ భూతాలూ, పిశాచాల చుట్టూ తిరగవుకదా" అన్నాడు మరో కజిన్.



వారి సంభాషణ చావిట్లో కూర్చున్న ఆడవారికి ఆసక్తి కలిగించిందనడానికి నిదర్శనంగా నిశ్శబ్దమయిపోయింది అక్కడ.

"ఇంతెందుకూ, మా ఊరే తీసుకో. అప్పుడప్పుడూ ఎక్కడో ఒకచోట దయ్యమో, భూతమో కనిపించిందన్న కబురు అందుతూనే వుంటుంది" అన్నాడు వెంకటేశ్ నవ్వుతూ.

"నమ్మేవాళ్లుంటే సరి అలాంటి కథలు ఎన్నయినా పుట్టుకొస్తాయి" అన్నాడు కిరణ్.

తరువాత టాపిక్ మారింది.

"ప్రయాణంలో బాగా అలసిపోయుంటావు. పొద్దుపోయింది పడుకో" అని స్నేహితుడు అనడంతో తన గదిలోకి వెళ్లిపోయాడు కిరణ్.

***

మర్నాడు గోదావరి ఒడ్డుకు వెళ్లారు వెంకటేశ్, కిరణ్‌లు. ప్రశాంతంగా, గంభీరంగా ప్రవహించే ఆ నదీమ తల్లిని తనివితీరా చూసి తన్మయత్వం చెందాడు కిరణ్. నావలో లంకకు వెళ్లారు. సాయంత్రం కబుర్లు చెప్పుకుంటూ ఇసుకలో చాలాదూరం నడిచారు. పచ్చటి ప్రశాంత ప్రకృతికి ముగ్ధుడయిపోయాడు కిరణ్.

పైన వెన్నెల, చుట్టూ కొబ్బరిచెట్లు, శరీరాలకు సేదదీర్చే చల్లటి గాలి మనసుకు ఆహ్లాదం కలిగించడంతో ఆ రాత్రి ఆరుబయట పడుకున్నాడు కిరణ్. అటువంటి అవకాశము, అనుభూతి తనబోటి పట్నవాసులకు అపూర్వము, అపురూవమూను. రోజంతా అలసిపోయి ఉండడంవల్ల కాబోలు పడుకున్న వెంటనే నిద్ర పట్టేసింది.

ఓ రాత్రివేళ ఎవరో తట్టి లేపినట్లుగా మెలకువ వచ్చేసిందతనికి. ఎవరూ కనిపించలేదు. వెంకటేశ్ సమీపంలో గాఢ నిద్రలో వున్నాడు. వాచ్ చూస్తే పదిగంటలయింది.


అంబరాన చంద్రుడు మల్లెపూల పాన్పుమీద తారకలతో సయ్యాటలాడుతున్నాడు. పున్నమి వెన్నెల జగతికి వెండి జలతార్లను అద్దుతోంది. ప్రకృతి కాంత ప్రియుడి పరిష్వంగంలో తెల్లగా మెరిసిపోతోంది. పగలంతా కాయకష్టం చేసి అలసిసొలసిన పల్లె ఆదమరచి నిద్రిస్తోంది. గోదావరి హోరు సన్నగా వినవస్తోంది. ఆ ప్రశాంత వాతావరణం చూస్తే కాసేపు ఆ వెన్నెల్లో తిరిగి రావాలనిపించింది కిరణ్‌కి.

ఏటిగట్టున మెల్లగా నడక ఆరంభించాడు. కునికిపాట్లు పడుతున్న కుక్క ఒకటి తలెత్తి అతనివంక చూసి ఏమనుకుందో మళ్ళీ పడుకుని కళ్ళు మూసుకుంది. తన ప్రమేయం లేకుండానే అతని కాళ్ళు గోదావరి వొడ్డుకు దారి తీసాయి.

పడవల రేవులో నిలుచున్నాడు కిరణ్. వెన్నెల్లో గోదావరి తెల్లటి వలువలు ధరించిన ప్రౌఢ యువతిలా అనిపించింది. ప్రియుడు పెట్టిన గిలిగింతలకు పుట్టుకొచ్చిన పులకింతల్లా అలలు సన్నటి కిలకిలలతో అలవోకగా సాగిపోతున్నాయి. దూరంలో లంకలు తెల్లగా మెరుస్తున్నాయి. లంకలలోని కొబ్బరిచెట్లు, తాటిచెట్లు గాలికి తలలూపుతూ నాట్యం చేస్తున్నాయి.

మైమరపుతో ఆ రమణీయ ప్రకృతిలో లీనమైపోయి అలా ఎంతసేపు ఉండిపోయాడో తెలీదు. మువ్వల చప్పుడుకు తేరుకున్నాడు కిరణ్. ఎవరో మెల్లగా అడుగులు వేస్తున్నట్లు కాలిమువ్వల చప్పుడు. అది ఎక్కడనుంచి వస్తుందోనని చెవులు రిక్కించాడు. గట్టుమీంచి వస్తున్నట్లనిపించి అటువైపు అడుగులు వేసాడు. మువ్వల చప్పుడు ఆగిపోయింది. తానూ ఆగిపోయాడు.


అంతలోనే రావిచెట్టు వెనుకనుంచి గాజుల



## గజాలాకి విజయం

టీనేజ్ కుర్రకారుకి ప్రేమ జ్వరం తెప్పిస్తారు కొంతమంది సినీతారలు. అలాంటి సినీతారల్లో గజాలా ఒకరు. 'స్టూడెంట్ నెంబర్-1' చేత 'పడ్డానండీ ప్రేమలో మరి' అనిపించిన గజాలా ఇప్పుడు ప్రేక్షకుల మదిలో మంచి స్థానాన్ని సంపాదించుకుంది. టేస్ట్ ఉన్న దర్శకుడిగా పేరున్న సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వం వహిస్తున్న 'విజయం' చిత్రంలో ఆమె హీరోయిన్ పాత్రని పోషిస్తోంది. రాజా హీరో అయిన ఈ చిత్రంలో స్టార్ ప్రొడ్యూసర్, ఎంపి రామానాయుడు విద్యామంత్రి హోదాలో కన్పిస్తారు. గ్లామర్, పెర్‌ఫార్మెన్స్ ఉన్న ఈ చిత్రంలోని పాత్ర మంచి బ్రేకనిస్తుందన్న ఆశాభావంతో ఉంది గజాలా. ఆమె ఆశ నెరవేరాలని మనమూ కోరుకుందాం.

-రాజా




సవ్వడి.

"ఎవరదీ?" అని పిలిచాడు.

సమాధానంగా గాజుల సవ్వడి ఆగిపోయింది.

చెట్టుచాటున ఎవరో వున్న అనుభూతి. మెల్లగా రావిచెట్టువైపు నడిచాడు.

చెట్టు వెనుక నుంచి గాజుల చేతులు బయటకు వచ్చి మళ్ళీ చప్పుడు చేసాయి.

చటుక్కున ఆ చేతులు రెండూ పట్టుకుని ముందుకు లాగాడతను. ఆ వూపుకు వచ్చి అతని వక్షానికి అంటుకుపోయింది ఓ యువతి. అతని హృదయతంత్రులు వీణానాదం పలికించాయి.

రెండు హృదయాల స్పందన, శరీరాల వేడి... పరవశంలో ముంచి ఏవో లోకాలకు తీసుకుపోయాయి అతన్ని. అయితే అది క్షణికం మాత్రమే.

త్రుళ్లిపడి ఆమెను వదిలేసాడు. దూరంగా జరిగి తల వంచుకుందామె సిగ్గుతో ముఖం ఎరుపెక్కడంతో.

ఆ వేళప్పుడు గోదావరి వొడ్డున ఒంటరిగా వున్న ఆ యువతిని చూసి ఓ క్షణం తొట్రుపడ్డాడు కిరణ్. వెన్నెల్లో ఆమె రూపం స్పష్టంగా కనిపిస్తోంది. పద్దెనిమిదేళ్ళ పడుచు. చామనచాయ, చక్రాల్లాంటి కాటుక కన్నులు, అందమైన రూపం, పాలమీగడలాంటి తెల్లటి పరికిణీ, ఓణీ, జాకెట్టు ధరించింది. విరబోసుకున్న పొడవాటి నల్లటి కురులు ఎత్తయిన ఆమె పిరుదులమీద నాట్యం చేస్తున్నాయి. సంపెంగల సువాసన, వదనంలో బేలతనం.

"ఎవరు నువ్వు?" అనడిగాడు ఆశ్చర్యంతో.

"గోదారి" అందామె మెల్లగా. ఆమె మృదుమధుర స్వరం అతని వీనుల్లో తేనెల సొనల్ని వొలికించింది.

"ఈవేళప్పుడు ఇక్కడ ఎందుకున్నావ్?"

జవాబివ్వలేదామె. ఓసారి అతని కన్నుల్లోకి చూసి ముందుకు కదిలింది కాళ్లకున్న మువ్వలు సన్నగా సద్దు చేస్తుంటే. అతన్ని దాటి గోదావరి వైపు నడిచింది.

హఠాత్తుగా అనిపించిందతనికి 'ఆమె నదిలో దూకి ఆత్మహత్య చేసుకోదుకదా' అని. అదిరిపడి "ఆగు" అని అరిచి ఆమె వెనుక వెళ్లాడు.

ఆగలేదామె. అలాగని నీళ్లల్లోకి దిగలేదు. నది వొడ్డునే ఇసుకలో నడక నారంభించింది.

అతను పిలుస్తున్నా వినిపించుకోకుండా ఏదో ట్రాన్స్‌లో వున్నదానిలా మెల్లగా నడుస్తూనే వుంది. విస్తుపోతూ ఆమె వెనుకే అడుగులు వేసాడతను.

ఆమెను చూస్తుంటే అతని బుర్రలో ఎన్నో సందేహాలు, ప్రశ్నలూను. 'ఆమె మనిషేనా? లేక?' తన పిచ్చి ఊహకు తనకే నవ్వొచ్చింది. 'దయ్యాలు పిశాచాలూ... నాన్సెన్స్! అనుకునే తన మదిలో అటువంటి ఆలోచన మెదలడమేమిటి? అబ్బే!' అనుకున్నాడు.

ఆమె నడుస్తుంటే రాయంచకు నడకలు నేర్పిందే ఆమేననిపించింది అతనికి. పిడికిట్లో ఇమిడే ఆమె నడుము మెలికలు తిరుగుతుంటే పారుతున్న సెలయేరు గుర్తుకొచ్చింది. గాలితో సయ్యాటలాడుతున్న పైట నావను నడిపించే తెరచాపలా వుంది. అల్లరిగా ఎగురుతున్న కురులు వలసపోతున్న తుమ్మెదల గుంపుల్లా ఉన్నాయి. ఆ రమణి అందానికో, ఆకర్షణకో వశుడైన కిరణ్ తనకు తెలియకుండానే ఆమెననుసరించాడు.

ఆమె వున్నట్టుండి తూలిపడబోయింది. వెన్నంటి వస్తున్న కిరణ్ చటుక్కున పొదివి పట్టుకున్నాడామెను. అతని బాహువుల్లో బందీ అయిన ఆమె శరీర లావణ్యం స్పర్శమాత్రంగానే షాక్ కొట్టించిందతనికి.

అతని వదనానికి చేరువైన ఆమె వదనం. వెచ్చని ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఇరువురినీ ఉక్కిరిబిక్కిరి చేసాయి. ఆమె కుచద్వయం తన వక్షాన్ని పరామర్శిస్తుంటే అతని రక్తం వేడెక్కింది. నరాలు జివ్వుమన్నాయి. ఆమె నడుమ్మీద చేతులు బిగించి ఆమెను మరింతగా హృదయానికి హత్తుకున్నాడు.

శంఖంలాంటి ఆమె కంఠాన్ని తన పెదవులతో రాస్తూ ఆమె అధరాలను గాఢంగా చుంబించాడు. ఆమె కూడా తమకంతో చేతుల్ని అతని మెడకు చుట్టేసి తన్మయత్వంతో కన్నులు మూసుకుంది. ఉద్వేగంతో వక్షం ఎగసిపడుతుంటే లతలా అతన్ని అల్లుకుపోయింది.

ఆమె మేని సువాసనలు అతనికి మత్తెక్కించాయి. అరమోడ్పు కన్నులతో, తనువులు మరచి, పరిసరాలను విస్మరించి, ఆ విరించి తమ కొసగిన వరంలా ఎంచి, మనసులను పెనవేసుకుని అలా ఎంతసేపు ఉండిపోయారో తెలీదు వాళ్లకు.

ఉన్నట్టుండి ఏదో పిట్ట కూయడంతో ఉలిక్కిపడి విడిపోయారు. ఏం జరిగిందో అతడు గ్రహించేలోపునే అతన్ని చటుక్కున వెనక్కి తోసేసి వడివడిగా అడుగులు వేసుకుంటూ వెళ్లిపోయిందామె.

ఆ వూపుకు ఇసుకలో వెల్లకిలా పడిపోయిన కిరణ్ తెల్లబోయాడు. లేచి "గోదారీ! ఆగు" అంటూ ఆమె వెనుకే వెళ్లాడు.

ఆగలేదామె. పరుగులాంటి నడకతో ఏటి

వొడ్డుకు చేరుకుంది. గబగబా ఆమెను అనుసరించాడతను. ఇసుకలో నడక అలవాటు లేనందున ఆమెను అందుకోలేకపోయాడు.

ఆమె వెనుదిరిగి చూడకుండా వేగంగా ముందుకు సాగిపోయింది. ఆమె వెనుకే వెళ్లాడతను.

తాము వెంకటేశ్ ఇంటి ప్రాంతాలలో వున్నట్టు అతను గ్రహించేసరికే అదృశ్యమైపోయిందామె. పరిసరాలలో ఎంత వెదికినా కనిపించలేదు. ఎంత హఠాత్తుగా ప్రత్యక్షమయిందో అంత హఠాత్తుగానూ ఆమె అదృశ్యం కావడం ఆశ్చర్యం గొలిపింది కిరణ్‌కి. ఆమె గురించే ఆలోచిస్తూ ఆమె మిగిల్చిన అనుభూతినే నెమరు వేసుకుంటూ నిద్రకు ఉపక్రమించాడు.

★★★

మర్నాడు ఆ సంఘటన గురించి ఆలకించిన వెంకటేశ్ ఆశ్చర్యపోయాడు. "నువ్వు చెబుతున్నది నిజమా?" అన్నాడు నమ్మలేకపోతున్నట్లు.

"లేక కలగన్నాననంటావా?" అన్నాడు కిరణ్ చిరుకోపంతో.

"అదికాదురా. నువ్వు చెప్పిన యువతి పోలికలు గోదారికి సరిపోయాయి మరి" అన్నాడు వెంకటేశ్.

"ఎస్! అదే. తన పేరు గోదారి అందామె" అన్నాడు కిరణ్ జ్ఞాపకం చేసుకుంటూ. "ఎవరామె?"

"గోదారి మా వూరి ఆడపడుచు. ఓ పొరుగూరి యువకుడి ప్రేమలోపడి మోసపోయిన పిల్ల. అవమానం భరించలేక గోదావరిలో పడి ఆత్మహత్య చేసుకుంది. ఇది జరిగి అయిదేళ్ళయింది."

ఉలిక్కిపడ్డాడు కిరణ్. "నో ఐ కాంట్ బిలీవ్! డోంట్ సే! రాత్రి నేను చూసింది దయ్యాన్నా?" అన్నాడు దాదాపు అరిచినట్లుగా.

"దట్స్ ఎగ్జాక్ట్లీ ద కేస్ మై ఫ్రెండ్" అన్నాడు వెంకటేశ్. "నువ్వు నమ్మవని తెలిసే ఆ విషయం చెప్పడానికి సంశయించాను."

"ఓ షిట్!" అన్నాడు కిరణ్ విసుగ్గా.

"కాదురా! నువ్వు చూసిన అమ్మాయి గోదారేనన్నదంలో సందేహంలేదు. లేకుంటే ఏ ఆడపిల్లయినా ఆ వేళప్పుడు అక్కడ ఎందుకుంటుంది? పైగా గోదారి నీటిలో పడి చనిపోయింది కూడా పడవల రేవులోనే. అప్పుడామె వంటిమీదున్నవీ తెల్లటి దుస్తులే. అప్పుడప్పుడు అలా ఎవరో ఒకరికి ఆమె కనిపిస్తూనే వుంటుందంటారు" అన్నాడు వెంకటేశ్.

కిరణ్‌కంతా అయోమయంగా అనిపించింది. రాత్రి తాను చూసింది దయ్యమంటే నమ్మబుద్ధి కావడంలేదు. ఆ స్పర్శ, ఆ హృదయ స్పందన, ఆలింగనం, లావణ్యం, స్వరం... దే ఆర్ సో రియల్! ఆమె మనిషేననిపిస్తోంది. ఎవరెన్ని కథలు చెప్పినా కాదని ఎలా నమ్మగలడు?

"సారీరా! నువ్వెంత చెప్పినా ఆమె మనిషి కాదంటే నా మనసెందుకో అంగీకరించడంలేదు" అన్నాడు మిత్రుడితో.

ఆ తరువాత అక్కడున్న రెండురోజులూ ఆ యువతి ఎక్కడైనా కనిపిస్తుందేమోనని చూసాడు కిరణ్, ఆమె తనకు కలిగించిన అనుభూతిని గురించే ఆలోచిస్తూ.

అతని కోరిక ఫలించలేదు.

రెండురోజుల తరువాత తిరుగు ప్రయాణమైన కిరణ్‌కి ఆప్యాయతతో వీడ్కోలు ఇచ్చారంతా. ఏటి వొడ్డున నడుస్తుంటే ఆ నాటి అనుభవమే మదిలో మెదిలింది కిరణ్‌కి.

అయితే-


వెళ్లిపోతూన్న కిరణ్‌ని చాటునుంచి చూస్తున్న వెంకటేశ్ కజిన్ అపర్ణ కాటుక కన్నుల్లో నీరు నిలిచింది.

'దయ్యాల గురించి మీ సంభాషణ ఆలకించి దయ్యాలు లేవన్న మీ వ్యక్తిత్వాన్ని పరీక్షించాలన్న ఆకతాయితనంతో ఆ రాత్రి గోదారిలా వచ్చి మిమ్మల్ని ఆట పట్టించబోయిన నాకు మీరందించిన అనుభవం, అనుభూతి ఎదురుచూడనివి, అపూర్వమైనవీను. మన పెదవుల కలయికను, గుండెల చప్పుళ్లను, శరీరాల పెనవేతను ఎలా మరచిపోగలను? జీవితంలో మరపురాని మరువలేని ఆ మధురానుభూతిని నా గుండెల్లో పదిలంగా దాచుకుంటాను. దాన్నందించిన మీరు కలకాలం గుర్తుండిపోతారు నాకు. గుడ్‌బై ఫ్రెండ్' స్వగతంలా అనుకోబోయి అప్రయత్నంగా పైకే అనేసిందామె.

ఆమె వెనుకే వచ్చిన రాజేశ్వరి "మీ చెల్లెలు నాకంతా చెప్పేసిందిలే. ఆ రోజు రాత్రి కిరణ్‌ని ఆట పట్టించిన ఆడదయ్యం నువ్వేనన్న సంగతి మీ అన్నయ్యకూ తెలిసిపోయింది. ఈ చిలిపి దయ్యాన్ని తన మిత్రుడికి శాశ్వతంగా అంటగట్టే ప్రయత్నంలో వున్నారాయన అప్పుడే" అంది నవ్వుతూ ఆమె తల నిమురుతూ.

మొదట తెల్లబోయినా అంతలోనే విషయం ఆకళింపు కావడంతో బుగ్గల్లో సిగ్గులు నిగ్గుదేరగా "ఫో... వదినా!" అంటూ ముఖం అరచేతుల్లో దాచుకుని అక్కడ్నించి తుర్రుమంది అపర్ణ.

★



## స్పానిష్ వాస్తుశిల్పి

శిల్పులకి అధికంగా అమోఘమైన తెలివితేటలుంటాయి. ఓ రాయిని అఖండమైన శిల్పంగా మలిచే శక్తి వారికి వుంటుంది. 1908లో స్పానిష్ వాస్తుశిల్పి యాండొనీగైడ్ చెక్కిన శిల్పాల గురించి మరచిపోలేదు అక్కడి ప్రజలు. ఎత్తయిన శిల్పాలు చెక్కడంలో అతనికి అతనే సాటి. 1180 అడుగుల ఎత్తు వున్న భవనం డిజైన్ చేసిన అతను ఈమధ్య వార్తల్లోకి మళ్ళీ వచ్చాడు. అయితే గత సంవత్సరం అమెరికాలో బిన్‌లాడెన్ పవర్‌కి గురైన స్థలంలో ఓ మోడల్ బిల్డింగ్ కట్టాలన్న ఆలోచన రాగా అందరూ కలసి ఏకగ్రీవంగా యాండొనీగైడ్ డిజైన్ చేసిన మోడల్స్‌లోని ఓ బిల్డింగ్ కట్టాలని నిర్ణయించుకున్నారట. చూశారా! తెలివంటే అతనిదే కదూ!

- శశి

